



పుడమిపై హరివిల్లు

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముగ్గుల పోటీలకు విశేష స్పందన

- ఉత్సాహంగా పాల్గొన్న 135 మంది మహిళలు, యువతులు
- కుటుంబసభ్యులతో సహా హాజరైన అతివలు
- శ్రీప్రకాష్ ప్రాంగణానికి సంక్రాంతి శోభ
- ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు
- మరో ముగ్గురికి కన్సొలేషన్, పాల్గొన్న వారందరికీ ప్రత్యేక బహుమతుల ప్రదానం

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'కు సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణం వేదికగా నిలిచింది. ఈ పోటీలకు నగర పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 135 మంది మహిళలు హాజరై తమలో దాగి ఉన్న సృజనాత్మకతను ముగ్గుల రూపంలో ప్రదర్శించారు.



సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత సంతోషి

మరిన్ని ఫొటోలు, వార్త 8వ పేజీలో



ప్రథమ స్థానంలో నిలిచిన సంతోషికి నగదు బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌పీ రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, ఏబీఎన్ ఇన్‌చార్జి ఆర్‌వై నాయుడు, ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ మేనేజర్ సత్యనారాయణ ఉన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

ముగ్గుల పోటీ ప్రాంగణానికి ఉదయం నుంచే మహిళలు కుటుంబ సభ్యులతో సహా హాజరై సందడి చేశారు. ముందే సంక్రాంతి వచ్చిందా అన్నట్టుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు సాగాయి. సంక్రాంతి పండగను ప్రతిబింబించేలా రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వాతావరణానికి ప్రతీకగా ముగ్గులు వేశారు.

ఉత్సాహంగా పోటీలు

ముగ్గుల పోటీకి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలందరికీ నిర్వాహకులు అవకాశం కల్పించారు. రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం సరికొత్త కళను సంతరించుకుంది. సంక్రాంతి థీమ్‌తో ముగ్గులు తీర్చిదిద్దారు. పచ్చని తోరణాలు, పాడి పశువుల సందడి, పూర్ణ కుంభం, పాలు పొంగే సిరులు, నవధాన్యాలు, పిండి వంటలు, చెరకు గడలు, డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు స్ఫురించేలా రంగవల్లులను తీర్చిదిద్దారు.

ముగ్గురు విజేతలకు బహుమతులు

ముగ్గుల పోటీలకు ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ఏఎస్ రాజా కళాశాల డైరెక్టర్ లారెన్స్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వీరిద్దరూ ఒకటికి రెండుసార్లు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. టాప్‌లో నిలిచిన ముగ్గురు విజేతలతో పాటు మంచి ముగ్గులు వేసిన మరో ముగ్గురిని కొన్సొలేషన్ బహుమతులకు ఎంపిక చేశారు. ఆరిలోవకు చెందిన ఎ.సంతోషి ప్రథమ స్థానంలో నిలిచింది. డైరీ ఫామ్ ప్రాంతానికి చెందిన వి.లక్ష్మీ మూర్తి ద్వితీయస్థానం, పెదవాల్తేరుకి చెందిన ఆర్.ప్రవీణ తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను అందించారు. లక్ష్మీదేవి, ఆర్.స్వాతి, కె.నాగమణిలకు కన్సొలేషన్ బహుమతుగా రూ.వెయ్యి చొప్పున 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యం అందించింది. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక బహుమతులను ఇచ్చారు. పోటీల అనంతరం పలువురు యువతులు, చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు. పోటీలకు హాజరవడంతో ఒత్తిళ్లు, ఇబ్బందులను మర్చిపోయి ఆనందంగా గడిపామని పలువురు మహిళలు పేర్కొన్నారు.



ప్రధాని సభ

చిరస్మరణీయంగా నిలవాలి

- దేశం మనవైపు చూసేలా నిర్వహించాలి
- సమన్వయంతో విజయవంతం చేయాలి
- 3 లక్షల మందిని తరలించేలా చర్యలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు మోదీకి కృతజ్ఞత తెలిపేలా నిర్వహణ
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి నారా లోకేశ్
- గణబాబుకు రోడ్ షో, పల్లాకు సభ పర్యవేక్షణ బాధ్యతలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

విశాఖలో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ చిరస్మరణీయంగా నిలిచేలా నేతలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధాని రోడ్ షో, సభ ఏర్పాట్లపై ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక రీతిలో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా విశాఖలో ప్రధాని సభ జరగాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్నారని, ఈ సందర్భంగా మూడు పార్టీల నేతలు, ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గతంలో ... మిగతా 6వ పేజీలో



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కూటమి నేతలు, అధికారులు

ప్రధాని పర్యటన షెడ్యూల్



విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల ఎనిమిదో తేదీని నగరానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన వివరాలను ప్రధాన మంత్రి కార్యాలయం ఆదివారం విడుదల చేసింది. ఎనిమిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టునుంచి ప్రధాని ప్రత్యేక విమానంలో బయలుదేరి, మధ్యాహ్నం 4.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.20 గంటలకు రోడ్డుమార్గంలో తాటిచెట్లపాలెం జంక్షన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, దత్ ఐలాండ్ జంక్షన్ మీదుగా ఏయూ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వద్దకు 4.25 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఓపెన్‌టాప్ వాహనంలో రోడ్‌షో నిర్వహిస్తూ ఏయూ ఇంజనీరింగ్ మైదానంలోని వేదిక వద్దకు సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. 6.30 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించిన అనంతరం బహిరంగసభలో మాట్లాడుతారు. 6.35 గంటలకు ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి రోడ్డుమార్గంలో ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రాత్రి 7 గంటలకు ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ వెళతారు.

బూత్ స్థాయి నుంచి జన సమీకరణ

- ప్రతి నియోజకవర్గానికి బస్సుల కేటాయింపు
- ప్రధాని సభ విజయంతానికి నేతల విస్తృత కసరత్తు

- 6వ పేజీలో

నైట్ ఫుడ్‌కోర్టుపై చర్యలేవీ?

కూటమి కార్పొరేటర్ల శపథం ఏమైందో?

- గతనెల 30 నాటికి తొలగించకపోతే ధర్నా చేస్తామని అల్టిమేటం
- అయినప్పటికీ యథావిధిగా కొనసాగుతున్న ఫుడ్ కోర్ట్
- కార్పొరేటర్ల తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు



నైట్ ఫుడ్‌కోర్టు

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

నైట్‌ఫుడ్‌కోర్ట్ తొలగింపుపై కూటమి కార్పొరేటర్ల తీరు అనుమానాలకు తావిస్తోంది. జీవీఎంసీ అనుమతి లేకుండా పాతజైలురోడ్డులో కొనసాగుతున్న నైట్ ఫుడ్‌కోర్ట్‌ను గతనెల 30లోగా తొలగించాల్సిందేనని, లేదంటే అక్కడే ధరాన చేస్తామని ప్రెస్‌మీట్ పెట్టి మరీ హెచ్చరించారు. ఈ విషయాన్ని వినతిపత్రంలో పేర్కొంటూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు అందజేసి అల్టిమేటం జారీచేశారు. డెడ్‌లైన్ దాటి వారం గడిచినా నైట్ ఫుడ్‌కోర్ట్‌పై ఎలాంటి చర్యలు కనిపించలేదు.

కూటమి కార్పొరేటర్లు అల్టిమేటం జారీచేసినప్పటికీ జీవీఎంసీ అధికారులు నైట్‌ఫుడ్ కోర్ట్ వైపు కన్నెత్తిచూడకపోవడం విశేషం. జీవీఎంసీ అనుమతి లేకుండా 32 దుకాణాలతో ప్రారంభమైన నైట్ ఫుడ్‌కోర్ట్‌లో ప్రస్తుతం 150కిపైగా దుకాణాలున్నాయి. వీటివల్ల జీవీఎంసీకి పైసా ఆదాయం సమకూరడం లేదు. పైగా అక్కడ పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ కోసం సిబ్బందిని కేటాయించి, నిధులు వెచ్చిస్తోంది. ఈ నేపథ్యంలో కొంతమంది దళారులు నైట్ ఫుడ్‌కోర్ట్‌ను గుప్పిట్లో పెట్టుకుని జేబులు నింపుకుంటున్నారని కార్పొరేటర్లు ... మిగతా 6వ పేజీలో

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లలో కలెక్టర్, జిల్లా అధికారులు నిమగ్నం కావడంతో కార్యక్రమం రద్దు చేశామన్నారు. కాగా జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్టు కమిషనర్ ప్రకటించారు. వీఎంఆర్‌డీఏ, నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నేడు ద్విచక్ర వాహన ర్యాలీ

- బీచ్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా సెయిల్‌లో విలీనం చేయాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు తెలిపారు. ర్యాలీ ఉదయం ఎనిమిదిన్నర గంటలకు కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద బయలుదేరి వడ్లపూడి, శ్రీనగర్, పాతగాజువాక, షీలానగర్, ఎన్ఏడీ జంక్షన్, కరాస, కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం రోడ్డు, రైల్వే గ్రౌండ్స్, తెలుగుతల్లి రోడ్డు, సిరిపురం జంక్షన్, పాండురంగస్వామి గుడి, ఆర్‌కె బీచ్ మార్గంలో బీచ్ సైడ్ బేకరీ జంక్షన్ వద్ద వాహనాలను పార్క్ చేసి, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర ద్వారా వెళ్లి, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

ఏయూ ఆదాయానికి గండి

- మైదానాల కేటాయింపులో వర్సిటీ అధికారుల పక్షపాతం
- ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను కొన్నాళ్లుగా ఒకే వ్యక్తికి కట్టబెడుతున్న వైనం
- ఒడిశాకు చెందిన ఈవెంట్ మేనేజర్ దరఖాస్తు తిరస్కరణ
- వర్సిటీ మాజీ ఉన్నతాధికారి సన్నిహితుడికి తక్కువ అద్దెకే కేటాయింపు
- చక్రం తిప్పుతున్న ఇదే సెక్షన్‌లోని ఉన్నతాధికారి
- ఆదాయానికి గండి పడుతున్నా దృష్టిసారించని ఉన్నతాధికారులు

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):



ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్

మైదానాలను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఏటా భారీగా ఆదాయం సమకూరుతుంది. సువిశాల విస్తీర్ణంలో ఉన్న వర్సిటీకి పలు చోట్ల ఖాళీ స్థలాలు ఉండడంతో వాటిని అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని సమూపార్జించు కుంటున్నారు. అయితే వర్సిటీలోని కొందరు అధికారులు ఆదాయానికి గండి కొట్టేలా నిర్ణ యాలను తీసుకుంటున్నారు. మైదానాల కేటాయింపుల్లో ఆశ్రిత పక్షపాతం వర్సిటీకి తీవ్ర నష్టం కలిగిస్తోంది.

తాజాగా ఏయూ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వెనుక ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో భారీ ఈవెంట్ నిర్వహించేందుకు ఇడిశాకు చెందిన ప్రముఖ ఈవెంట్ మేనేజర్ వర్సిటీ అధికారులను సంప్రదించారు. మైదానం అద్దెకు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. గతంలో కంటే భారీగానే అద్దె చెల్లించేందుకు సిద్ధపడ్డారు. అయితే సంక్రాంతి సీజన్ కావడంతో ... మిగతా 6వ పేజీలో



ఘాట్ రోడ్డులో రాళ్లపై ఫొటోలు తీసుకుంటున్న యువత

కొండ గుట్టలపై యువత ఫీట్లు

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దర్శనానికి వచ్చిన కొందరు యువకులు ఘాట్ రోడ్డులో ఉన్న గుట్టలపైకి ఎక్కి ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆఖరి మలుపులో రక్షణ గోడపై నిలబడి చాలామంది ఫొటోలు దిగుతున్నారు. గతంలో ఇక్కడ ఓ వ్యక్తి ఫొటో తీసుకునే ప్రయత్నంలో కింద జారిపడి గాయపడ్డాడు. దీంతో అధికారులు అక్కడ మెస్‌లు ఏర్పాటు చేశారు. అయినా కొందరు యువత మెస్‌లు దాటి మరీ ఫొటోలు తీసుకుంటున్నారు. అటువైపుగా వెళ్లే భక్తులు ప్రమాదమని వారిస్తున్నా.. వినడం లేదు.

భీమిలిలో రూ.4.41 కోట్లతో రోడ్ల నిర్మాణం



అన్నవరంలో జరుగుతున్న రోడ్డు పనులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 పంచాయతీల్లో రూ.4.41 కోట్లతో 5.01 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ నిధులు మంజూరు చేశారు. ఆయా పంచాయతీల్లో 21 పనులను ప్రతిపాదించారు. కొన్నిచోట్ల దాదాపుగా పనులు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల సంక్రాంతిలోగా పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీల వారీగా పరిశీలిస్తే తాటితూరులో రూ. 40 లక్షలతో 300 మీటర్ల పనులు చేపట్టగా సింగనబందలో రూ. 30 లక్షలతో 400 మీటర్లు, చిప్పాడలో రూ. 15 లక్షలతో 200 మీటర్లు, లక్ష్మీపురంలో రూ. 50 లక్షలతో 450 మీటర్లు, పెద నాగమయ్యపాలెంలో రూ.22.50 లక్షలతో 400 మీటర్లు, మజ్జిపేటలో రూ. 30 లక్షలతో 500 మీటర్లు, దాకమర్రిలో రూ. 15 లక్షలతో 320 మీటర్లు, తాళ్లవలసలో రూ. 62 లక్షలతో 800 మీటర్ల రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

భరతనాట్యంలో సాయి హరిణికి పురస్కారం

తగరపువలస, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీమాతా ఆరామ ద్రావిడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మారికవలస కాశీవిశ్వేశ్వర దేవాలయంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక సమ్మేళనంలో తగరపువలసకు చెందిన వెంకట సాయి హరిణి భరత నాట్యంలో ప్రత్యేక పురస్కారం పొందారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు హాజరైన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నృత్య పోటీలు నిర్వహించారు. ఈమేరకు తగరపువలసకు చెందిన సాయి హరిణి ప్రదర్శించిన భరత నాట్యం పలువుర్ని ఆకట్టుకుంది. నిర్వాహకులు ఆమెకు ప్రత్యేక పురస్కారం అందించి, అభినందించారు.

మద్యం దుకాణాలు తనిఖీ



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్

సాగర్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులోని గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో మద్యాన్ని ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలన్నారు. కొనుగోలుదారులు దుకాణం వద్ద మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రుణాలు చెల్లించి, అభివృద్ధికి సహకరించండి

అడవివరం పాలక మండలి మహాజన సభలో అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అడివివరం సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న వారు నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించి సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి కోరారు. ఆదివారం స్థానిక బృందావనంలో సంఘం మహాజన సభ జరిగింది. ముందుగా సంఘం కార్యకలాపాల నివేదికను కార్యదర్శి మీసాల శివ సభ్యుల ముందుంచారు. అనంతరం సభ్యులు కొన్ని సూచనలు చేయగా మరికొందరు ప్రశ్నలు లేవనెత్తారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ వినియోగదారులకు సహకరిస్తూ సంఘాన్ని అభివృద్ధి చేయాలన్న యోచనతోనే ఇన్‌టైమ్ సెటిల్‌మెంటు ప్రవేశపెట్టామని, కానీ 2016 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.27 కోట్లు బకాయిలు పెండింగ్ ఉన్నాయన్నారు. వాటి వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని 31 మార్చి 2019 వరకు బకాయిదారులకు వర్తింపజేశామని తెలిపారు. బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 2016 నుంచి 2022 వరకు సుమారు 6.5 కిలోల బంగారు ఆభరణాలు కుదువపెట్టి రుణాలు తీసుకుని విడిపించని వాటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించి బకాయిలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని, దీనికి సభ్యులు ఆమోదం తెలపాలని కోరారు. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరం 2025 ఏప్రిల్ 1 నుంచి సంఘ లావాదేవీలన్నింటిని పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏప్రిల్ 1 నుంచి వడ్డీ రేట్లు స్వల్పంగా పెంచనున్నట్టు ప్రకటించారు.కాగా ప్రస్తుత సభ్యుల వాటా ధనంపై 20 శాతం, త్రిఫ్ట డిపాజిట్లపై 8 శాతం వార్షిక డివిడెంట్లు ఇచ్చేందుకు మహాజన సభ ఆమోదం తెలిపింది. సంక్రాంతి కానుకగా ఈనెల 9 నుంచి డివిడెంట్లు పంపిణీ చేయనున్నారు. సమావేశంలో పాలక మండలి ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు, పాలకమండలి సభ్యులు కొలుసు గురునాథరావు, బోర ప్రసాదరెడ్డి, మజ్జి ధర్మరాజు, ఆకుల నూగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల కృష్ణంనాయుడు, కోరాడ ఈశ్వరరావు, పోలవరపు రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

క్రీడలతో శారీరక ఉల్లాసం

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అన్నారు. ఆదివారం ఆయన బీసీ గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత గోపాలపట్నం సీఐ జి. అప్పారావుతో కలిసి ఆయన క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలకు జోన్-1 పరిధిలోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలోని 15 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 375 మంది విద్యార్థులు, 15 మంది వ్యాయామ శిక్షకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమా మోహిని, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో స్వల్ప మార్పు

విశాలాక్షినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో జరుగుతున్న అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో స్వల్ప మార్పు చేశారు. ఈమేరకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఎం.రవిప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు పీఈటీ పరీక్షలు జరిగే శ్రీకాకుళం,విజయనగరం జిల్లాల్లో ఈనెల 8న జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను 11వ తేదీకి వాయిదా వేశామన్నారు. పూర్తి వివరాలకు 944145 0639 సెల్ నంబరును సంప్రతించాలని సూచించారు.

వ్యక్తిని గాయపరచి, నగదు అపహరణ

ఎండాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిని గాయపరచి నగదు, చేతికి ఉన్న ఉంగరం దొంగలు అపహరించారు. పీఎంపాలెం సీఐ జి. బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మారికవలసలో ఉంటున్న వానపల్లి శంకర్రావు వెల్లంకిలోని జెరాక్స్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా మారికవలస అన్నా క్యాంటీన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఎదురుగా వచ్చి డబ్బులిమ్మని బెదిరించారు. ఇవ్వకపోవడంతో ఆయన్ను కొట్టి జేబులోని పర్స్ (రూ. 2 వేలు), చేతికి ఉన్న సిల్వర్ రింగ్ లాగుక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గానగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మొగదారమ్మ కాలనీ, దుర్గానగర్‌లో టీడీపీ నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, లొడగల భవానీ, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

బూత్ స్థాయి నుంచి జన సమీకరణ

మహారాణిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్‌షో, సభ విజయవంతానికి బూత్‌స్థాయి నుంచి జన సమీకరణ చేపట్టాలని మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాని సభ విజయంతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృత కసరత్తు చేశారు. ఇందులో భాగంగా బూత్‌లెవెల్‌లో కేడర్‌ను సమాయత్తం చేసుకుని పెద్దఎత్తున జనాన్ని ప్రధాని సభకు తరలించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గాని బస్సులు కేటాయించాలని సూచించారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, విప్ గణబాబు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయకుమార్, గౌతు శిరీష, గొండు శంకర్, బెందాళం అశోక్, కార్పొరేషన్ల చైర్మన్లు గండి బాబ్జీ, తాతయ్యబాబు, దొన్నుదొర, పీలా గోవింద్, దామచర్ల సత్య, కిడారి శ్రావణ్‌కుమార్, మల్ల సురేంద్ర, నేతలు బుద్దా నాగజగదీష్, గిడ్డి ఈశ్వరి, లాలం భవాని, బండారు అప్పలనాయుడు, కోట్ని బాలాజి తదితరులు పాల్గొన్నారు.

గోప్యంగా బస్ బే ప్రారంభం



ప్రారంభోత్సవం జరిగిన పట్టణంలోని బస్ బే


భీమునిపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బస్ బే ప్రారంభోత్సవాన్ని అధికారులు గోప్యంగా పూర్తి చేయడంతో స్థానికులు అవాక్కవుతున్నారు. జీవీఎంసీ సాధారణ నిధులు రూ.44. 50 లక్షలతో బస్ బేను పునరుద్ధరించారు. ఎన్నికల సమయంలో ఈ పనులు ప్రారంభమైనా, అనంతరం నత్తనడకన సాగుతూ ఇటీవల పూర్తి చేశారు. రెండు రోజుల క్రితం శిలాఫలకానికి న్యూస్ పేపర్లు అతికించారు. దీంతో నేడో, రేపో ప్రారంభిస్తారని అంతా భావిస్తున్నారు.అయితే పేపర్లను జోనల్ కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులు హఠాత్తుగా తొలగించారు. తీరా, శిలాఫలకం పరికించి చూస్తే గత డిసెంబరు 18న బస్ బేను మేయర్ గొలగాని హరివెంకట కుమారి ప్రారంభించినట్టు,సభాధ్యక్షుడిగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యవహరించినట్టు ఉంది. ఈ విషయమై జోనల్ కార్యాలయం పబ్లిక్ వర్క్స్ ఏఈ సురేశ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, ప్రారంభోత్సవం జరిగిందన్నారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవం తరచూ వాయిదా పడుతున్నదని, దీంతో ఆదరాబాదరాగా ప్రారంభించినట్టు చెప్పారు.అధికారుల తీరుపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



బేడా మండపంలో స్వామివారి తిరువీధి



పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) గోదాదేవి అలంకరణ



వైభవంగా అప్పన్న పగల్‌పత్ తిరువీధి

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పగల్‌పత్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి ఆదివారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పలు సుగంధభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది బంగారు తొళ్ళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్ఛారణలు నడమ బేడామండపంలో తిరువీధి జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను అనుసంధానం చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోదాదేవికి 21వ పాశురం విన్నపం

సింహగిరిపై గోదాదేవి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సుప్రభాత ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. మంగళవాయిద్యాలు, వేదమంత్ర పఠనాలు నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం ఘనంగా జరిపారు. మార్గ మధ్యలో అష్టదిక్పాలకులకు పూజలు చేసి ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో అధ్యాపకులు తిరుప్పావైలోని పాశురాలను విన్నవించారు. అలాగే కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవళంలో కూడా ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవమూర్తిని గోదాదేవిగా చామంతి, గులాబి తదితర పరిమళభరిత పుష్పమాలికలతో,ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. షోడశోపచరాలు సమర్పించిన తరువాత భక్తులు, వైదికులు తిరుప్పావై 21వ పాశురాన్ని విన్నపం చేశారు.



పర్యాటకులతో కళకళలాడుతున్న రుషికొండ బీచ్



భీమిలి బీచ్‌లో సందర్శకులు

తీర ప్రాంతాల్లో పర్యాటక సందడి

భీమునిపట్నం/సాగర్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా మారింది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కడలి కెరటాల్లో కొందరు స్నానాలు చేస్తూ సందడి చేయగా, మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ కనిపించారు. సాగర కన్య, గాంధీ పార్క్‌లో లవ్ భీమిలి యాంబ్లమ్ వద్ద పలువురు సెల్ఫీలు తీసుకుని, ఆనందించారు. అలాగే రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు కూడా సందర్శకులతో కళకళలాడాయి. వాతావరణం చల్లగా ఉండడంతో పాటు ఎగసిపడే కెరటాలను చూసి పర్యాటకులు మురిసిపోయారు. చలిని సహితం లెక్కచేయకుండా సముద్ర స్నానాలు చేశారు. కొందరు కెరటాలపై బోటుషికార్ చేస్తూ.. ఉల్లాసంగా గడిపారు. ఇటీవల ప్రవేశానికి నోచుకున్న దక్షిణ రహదారి కూడా సందర్శకులతో సందడి కనిపించింది.



ప్రధాన రహదారిలో తరచూ ఇదే పరిస్థితి

తగరపువలసలో ట్రాఫిక్ ఇబ్బందులు

తగరపువలస, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రధాన రహదారితో పాటు కూడలి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. 20 ఏళ్ల క్రితం ఈ రహదారిని 40 అడుగుల మేర విస్తరించారు. కొంతకాలంగా చిరు వ్యాపారాలు పెరిగిపోవడంతో విపరీతంగా రద్దీ నెలకొంటోంది. వాహనాలు తప్పుకోవడానికి కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారిలో ఆదివారం సంత జరుగుతుండడం వల్ల పాదచారులు అవస్థలు పడుతున్నారు. చిరు వ్యాపారులు, పండ్ల దుకాణాలు, కూరగాయల అమ్మకందారులు రోడ్డు పక్కన, డివైడర్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. సిటీ బస్సులు, ఆటోలు కొన్నిసార్లు ముందుకు వెళ్లలేని పరిస్థితి. దీంతో ప్రమాదాల భయం కూడా నెలకొంటోంది. పరిసరాల్లోని ఆరు మండలాలకు కేంద్రంగా తగరపువలస ఉంది.ఆయా గ్రామాల నుంచి వచ్చే వారితో ఎప్పుడూ రద్దీగా కనిపిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జీవీఎంసీని సందర్శించిన కోర్బా నగర పాలక సంస్థ సభ్యులు

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్‌లోని కోర్బా నగర పాలక సంస్థ సభ్యులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. మేయర్ రాజా కిశోర్ ప్రసాద్, చైర్‌పర్సన్ శ్యామ్ సుందర్ సోనీతో పాటు 20 మంది కార్పొరేటర్లు అధ్యయన యాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చారు. వారికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్యదర్శి బీవీ రమణ జీవీఎంసీలో అమలు చేస్తున్న పథకాలు, పారిశుధ్య నిర్వహణ, చెత్తసేకరణ, విభజనతో పాటు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి, వ్యర్థాలను సంపదగా మార్చే ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జీవీఎంసీ కౌన్సిల్ హాల్‌ను పరిశీలించారు. వారికి జీవీఎంసీ అధికారులు జ్ఞాపికలు అందజేశారు.

ఏయూ ఆదాయానికి గండి

... 5వ పేజీ తరువాయి

కొన్నేళ్లుగా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి వర్సిటీ అధికారులను సంప్రదించాడు. తనకు మైదానాన్ని ఇవ్వాలని కోరారు. ఈ వ్యక్తి వర్సిటీ మాజీ ఉన్నతాధికారికి అత్యంత ఆత్మీయుడు కావడంతో ఈ సెక్షన్‌లోని అధికారులు తలలూపారు. గతంలో దరఖాస్తు చేసిన వ్యక్తికి మైదానం అద్దెకు ఇవ్వడం కుదరదని చెప్పేశారు. మాజీ ఉన్నతాధికారికి ఆత్మీయుడైన వ్యక్తికి తక్కువ అద్దెకే ఇచ్చేశారు. తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైదానంలో ఏడెకరాలు వినియోగంలో ఉన్నట్టు తెలుస్తోంది. నగరం మధ్యలో ఉన్న ఈ స్థలాన్ని అద్దెకు ఇస్తే రోజుకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. కానీ వర్సిటీ అధికారులు మాత్రం తక్కువ అద్దెకు ఇచ్చి స్వామిభక్తిని చాటుకున్నారు. దీంతో వర్సిటీ ఆదాయానికి భారీగా గండిపడింది. అయినప్పటికీ ఉన్నతాధికారుల్లో చలనం కనిపించడం లేదు.

ఉన్నతాధికారి సూచనతోనే?

సాధారణంగా మైదానం కోసం పోటీ ఉన్నప్పుడు ఎక్కువ అద్దె ఎవరు ప్రతిపాదిస్తే వారికి ఇవ్వాలి. కానీ అధికారులు తమకు కావాల్సిన వారికి తక్కువ అద్దెకు ఇవ్వడంపైనే దృష్టి పెట్టారు. ఈ కేటాయింపు వెనుక మాజీ ఉన్నతాధికారి సూచనలున్నాయని చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వర్సిటీ ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరుతున్నారు. సాధారణంగా మైదానం అద్దెకు ఇవ్వాలంటే నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వాలని, కానీ అవేవీ పాటించడం లేదని చెబుతున్నారు. విశాఖ లాంటి మహా నగరంలో భిన్నమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు సువిశాలమైన స్థలాన్ని కోరుకునే వ్యాపారులు, ఈవెంట్ ఆర్గనైజర్లు ఎంతోమంది ఉన్నారు. వర్సిటీ అధికారులు మాత్రం ఈ స్థలాన్ని ఎప్పుడూ ఒకే వ్యక్తికి కట్టబెడుతున్నారు. దీనివెనుక అంతర్యమేమిటో ఎవరికీ అంతు చిక్కడం లేదు.

నైట్ ఫుడ్‌కోర్ట్‌పై చర్యలేవీ?

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. దీనివెనుక వైసీపీ ప్రజాప్రతినిధులున్నారని బహిరంగంగానే విమర్శించారు. ఫుడ్‌కోర్ట్‌ను రద్దుచేయాలని జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో తరచూ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్పందించిన కౌన్సిల్ ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని ఏడాది కిందటే తీర్మానం చేసింది. అయినప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. దీంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ప్రెస్‌మీట్ పెట్టి నైట్ ఫుడ్‌కోర్ట్‌లో జరుగుతున్న అక్రమాలను ఏకరువుపెట్టారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారని, డిసెంబరు 30లోగా ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని, లేదంటే ధర్నా చేస్తామని జీవీఎంసీ కమిషనర్‌కు అల్టిమేటం జారీచేశారు. తర్వాత ఏమైందో కూటమి కార్పొరేటర్లంతా మౌనం వహించారు. కాగా వారికి ఏదో ఆఫర్ వచ్చి ఉంటుందని, అందుకే నోరెత్తడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రధాని సభ చిరస్మరణీయంగా నిలవాలి

... 5వ పేజీ తరువాయి

విజయవాడలో నిర్వహించిన సభను మించి యావత్‌దేశం మనవైపు చూసేలా విశాఖ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభకు కనీసం మూడు లక్షల మంది హాజరయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అధిక నిధులు కేటాయిస్తోందని, అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోందని, మోదీ సభను విజయవంతం చేయడం ద్వారా దానికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. రోడ్‌షో ద్వారా ప్రధాని ప్రజలను పలుకరించనున్నారని, ప్రజలంతా ప్రధాని కాన్వాయ్‌కి చేరువగా ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందిలేకుండా రోడ్‌షో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేతలకు బాధ్యతల అప్పగింత

ప్రధాని మోదీ వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభా వేదిక వరకు రోడ్‌షో నిర్వహిస్తారని, ఆయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. రోడ్‌షో బాధ్యతలను విప్ గణబాబుకు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. మిగిలిన నేతలంతా వారికి సహకరించాలన్నారు. ప్రధాని సభ చారిత్రాత్మకమని, ఈ మూడు రోజులు ప్రజాప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని నిర్దేశించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంకబ్రాత బాగ్చీ మంత్రికి వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీవీఐపీ, వీఐపీ వాహనాలు, సభకు తరలివచ్చే ప్రజల వాహనాలకు 26 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేశ్

విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా!

- శ్రీకృష్ణాపురం గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్‌పై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశం
- విద్యార్థులతో మాటామంతీ



ప్రిన్సిపాల్ రత్నవల్లిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి

ఆరిలోవ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శ్రీకృష్ణాపురంలోని డా.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.రత్నవల్లిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంట తరువాత అక్కడకు చేరుకొన్న ప్రిన్సిపాల్‌ను ఇదేం విధానమంటూ నిలదీశారు. ఇక్కడి క్వార్టర్స్‌లో కాకుండా ప్రిన్సిపాల్ ఎక్కడో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. సమయ పాలన పాటించడం లేదని, పాఠశాల సమస్యలను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యం తగదన్నారు.

అనంతరం మంత్రి విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడే ఉన్న వేదికపై విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తోన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువు కొనసాగించాలన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఇటీవల తోటగరువు హైస్కూలులో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు. అలాగే ఇటీవల జరిగిన వివిధ క్రీడా పోటీల్లో గెలిచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి, పాల్గొన్న అధికారులు

అనంతరం హాస్టల్ గదులు, వంటశాలనుమంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పర్యటనలో విజయనగరం,మన్యం జిల్లాలగురుకులాల పాఠశాల సమన్వయకర్త ఎస్.రూపవతి, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, పాఠశాల వైఎస్ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు స్వీకరిస్తున్న సత్యనారాయణ, రవికుమార్ తదితరులు

వెంకోజీపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని ఆదివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవి కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను నమోదు చేశారు. సుమారు 300 మంది నుంచి సభ్యత్వాలు స్వీకరించినట్టు సత్యనారాయణ తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించడమే కాకుండా వ్యక్తి భద్రతకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు బోర ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, అప్పారి గిరిబాబు, సంపంగి సురేష్, తెలుగు మహిళా నేతలు వరలక్ష్మి, కర్రి గౌరీ, సోని, సన్యాసమ్మ, గ్రామ పెద్దలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు

రోలార్ స్కేటింగ్ కోచ్‌లకు సన్మానం



కోచ్‌లను సన్మానిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

రామ్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రోలార్ స్కేటింగ్ శిక్షణలో ప్రతిభ కనపరిచిన కోచ్‌లకు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ చేతుల మీదుగా సన్మానం నిర్వహించారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన 62వ జాతీయ రోలార్ స్కేటింగ్-2024 పోటీల్లో నగరానికి చెందిన స్కేటర్లు పలువురు పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవ్ గోపాల్ కోచ్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు చక్కని శిక్షణ అందించి వారు పతకాలు సాధించేలా కృషి చేయడం అభినందనీయం అన్నారు. క్రీడాభివృద్ధికి వీఎంఆర్డీఏ సహకారం, ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమలో ఏపీ రోలార్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ జె.సుధాకర్‌రెడ్డి, బి.భగీరథరావు, ఐ.థామస్, రవిచంద్ర, శీలం లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు



జి.కవిటికి చెందిన కళాకారుల సన్నాయి ప్రదర్శన

ఆరిలోవ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవకు ఆదివారం సంక్రాంతి పండగ ముందే వచ్చింది. అంతా పల్లె వాతావరణంతో నిండింది. ఆదివారం జీవీఎంసీ 12వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు గాడి సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు అలరించాయి. ఈ సందర్భంగా వి.యశస్విని, కేవీ ఉద్దండ, ఎం.సుస్మిత కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. ఆరిలోవ డ్రైవర్స్ కాలనీకి చెందిన కోలాట ప్రదర్శన, తగరపువలస పోతురాజు బృందం ప్రదర్శించిన గిరిజన కోలాటం, స్థానిక భారతీయ స్కూలు విద్యార్థుల థింసా నృత్యం, జి.కవిటికి చెందిన కళాకారుల సన్నాయి ప్రదర్శన, శ్రీకాకుళం జిల్లా కవిటికి చెందిన కళాకారులు రాజమ్మ ఆట ప్రదర్శన, చిట్టివలసకు చెందిన వారి నాగిని నృత్యం ఆకట్టుకున్నాయి. సంప్రదాయ నృత్యాలు, జానపద ప్రదర్శనలతో ఆ ప్రాంతం మోరుమోగింది. పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయంలో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వెలగపూడి

గోపాలపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణ, రోడ్ షో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించడానికి నగరానికి విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం 8.50 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబుతో పాటు పలువురు కూటమి నాయకులు స్వాగతం పలికారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 42, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 60, కీర దోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ ఓవరాల్ చాంప్ విశాఖ



ఓవరాల్ చాంప్ ట్రోఫీ అందుకుంటున్న విశాఖ అథ్లెట్లు

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఆదివారం తణుకులో జరిగిన ఈ టోర్నీలో విశాఖ అథ్లెట్లు మూడు స్వర్ణ, ఒక రజత, ఐదు కాంస్య పతకాలు సాధించి పురుషుల, మహిళల విభాగాల్లో సంయుక్తంగా ఓవరాల్ చాంప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు.

జమ్ముకశ్మీర్‌పై చండీగఢ్ విజయం

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చండీగర్ ఏడు వికెట్ల తేడాతో జమ్ము-కాశ్మీర్‌పై విజయం సాధించింది.

తొలుత బ్యాటింగ్ చేసిన నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 285 పరుగులు చేసింది. శుభం ఖజూరియా (72), అబిద్ ముస్తక్ (53 నాటౌట్), సహిల్ లోత్రా (40), నసిర్ ముజాఫర్ (28) రాణించారు. చండీగర్ బౌలర్లలో నిశంక్ బిర్లా మూడు, నిఖిల్ శర్మ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చండీగర్ 42.3 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి 291 పరుగులు చేసి విజయం సొంతం చేసుకుంది.

ఓపెనర్లు మనన్ వోహ్రా (107), తుషార్ జోషి (131) సెంచరీలు సాధించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు. జమ్ము కాశ్మీర్ బౌలర్ సునీల్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు.





మోగిన శంఖం



కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు







సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



నిత్యం ఉత్తర ద్వార దర్శనం

త్రిమూర్తిక వెంకన్న ఆలయ ప్రత్యేకం



ముక్కోటి ఏకాదశి కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్న త్రిమూర్తిక వెంకన్న ఆలయం

వెంకోజీపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ స్వామి బాల వెంకన్నగా భక్తులకు దర్శనమిస్తారు. ఓ భక్తుడికి బాలుడి రూపంలో కనిపించి ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని వేంకటేశ్వరస్వామి చెప్పారని పెద్దలు చెబుతుంటారు.

సుమారు ఐదు దశాబ్దాల క్రితం సీతమ్మధార రెవెన్యూ నివాస గృహ సముదాయంలోని జె-41లో గోపావఝల సూర్యనారాయణ, వేంకటరమణమ్మ దంపతులు తమ ఇంట వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మల పూజలు నిత్యం వైభవంగా జరుగుతుండేవి. స్వామి వారి కళ వాయు రూపాన రమణమ్మను ఆవహించి భక్తుల ప్రశ్నలకు తగు విధంగా సమాధానాలు చెప్పేవారట. వీరిని భక్తులు 'బాలగారు' అని కొనియాడేవారు. అలా భక్తి పారవశ్యంతో ఆ ఇంట భక్తుల సందేహాలను తీర్చుతున్న వెంకటరమణమ్మ మదిలో 1966, డిసెంబర్ 31 నుంచి 1967, జూన్ 13 రాత్రి 2.28 గంటల వరకు 5 మార్లు దివ్య ఘంటానాదాలతో వెంకటన్న స్వామి పాదఛాయలు పూర్ణాభివృద్ధి పొందినట్టు చెబుతారు. ఈ క్రమంలో 1967 డిసెంబరు, 30న బాలగారికి స్వామి కళలో కనిపించి ఎంఎంటీసీ కాలనీలో ఆలయ నిర్మాణానికి ఫలానా చోటులో స్థాపించాలని నిర్దేశించినట్టు పెద్దలు చెబుతుంటారు.

ఆలయ ప్రత్యేకత..



బాల వెంకన్న స్వామి ఆలయం

- ముక్కోటి ఏకాదశి పూజలకు ఘనంగా ఏర్పాట్లు

తిరుమల తిరుపతి వేంకటేశ్వరుని ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. కేవలం ఏడాదిలో ఏకాదశి, ద్వాదశి రోజులలో మాత్రమే ఈ అవకాశాన్ని కల్పించడం జరుగుతుంది. కానీ త్రిమూర్తిక వేంకటేశ్వరుని ఆలయం మాత్రం నిత్యం ఉత్తర ద్వార దర్శనమే కలుగుతుంది. ఉత్తర ముఖంగా వెంకన్న స్వామి ఆలయాన్ని నిర్మించడం వలన నిత్యం భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించడం ఈ ఆలయ ప్రత్యేకత. ధనుర్మాస ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహిస్తుంటారు.

ముక్కోటి ఏకాదశి ప్రత్యేక అభిషేకాలు

ఆలయంలో ప్రతీ ఏటా నిర్వహించే విధంగా ముక్కోటి ఏకాదశి ప్రత్యేక అభిషేకాలు ఈ నెల 10న నిర్వహించనున్నట్టు ఆలయ కార్యదర్శి డాక్టర్ ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు తెలిపారు. ఏకాదశి రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అభిషేకాలు నిర్వహించడం కష్టం కావడంతో ముందు రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజు పలు ప్రత్యేక పూజలతో పాటు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు గోదా అమ్మవారికి అభిషేకం, తోమాల సేవ, అలంకారం, అర్చన ఉంటాయన్నారు. 10న జరిగే ముక్కోటి ఏకాదశి దర్శనాలు, 11న ద్వాదశి పూజలు ఉంటాయన్నారు. జనవరి 10న నీరాట్టం ఉత్సవం, 11న కుడారై ఉత్సవం, 13న గోదా అమ్మవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

విశాఖ మ్యూజియంలో మిల్లెట్ చిత్రాలతో ప్రదర్శన

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ కుమార్ మిల్లెట్స్ వేసిన చిత్రాల ప్రదర్శనను బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఈ ప్రదర్శన ఉంటుంది. ఆదివారం ఈ ఎగ్జిబిషన్‌ను వరుణ్ సంస్థల చైర్మన్ వి.ప్రభుకిషోర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అరుదైన మిల్లెట్ ఆర్ట్‌తో విశాఖ నగరానికి విజయకుమార్ ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారన్నారు. రంగులు ఉపయోగించకుండా సహజత్వంతో తయారు చసిన ఈ చిత్రాలు ఎంతో ప్రత్యేకమన్నారు. సామాజిక స్పృహతో కళకు ఒక సందేశాన్ని జోడించి చిత్రాలను వేయడం అభినందనీయమన్నారు. చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం నుంచి స్ఫూర్తి పొందిన తాను గడిచిన ఏడాదిన్నర కాలంగా మిల్లెట్ చిత్రాలను వేస్తున్నట్టు తెలిపారు. అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జీవితంలోని ముఖ్య ఘట్టాలతో మిల్లెట్ చిత్రాన్ని తయారు చేసినట్టు తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీన నగరానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో మిల్లెట్ ఉపయోగించి మోదీ చిత్రపటాన్ని తయారు చేసినట్టు విజయ కుమార్ వెల్లడించారు. జిల్లా అధికారులు అవకాశం ఇస్తే ప్రధానికి ఈ చిత్రాన్ని బహూకరించనున్నట్టు వెల్లడించారు.



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రం



ప్రభుకిషోర్‌కు చిత్రాలు గురించి వివరిస్తున్న విజయ కుమార్

రోలర్ స్కేటింగ్ టోర్నీలో విశాఖ స్కేటర్లకు పతకాలు



అభినందన సభలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులతో వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు అభినందన కార్యక్రమం ఆదివారం జరిగింది. స్కేటింగ్ రింక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై పతకాలు సాధించిన స్కేటర్లు, కోచ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడాంశానికి విశాఖ ప్రధాన కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, స్కేటింగ్ క్రీడాభివృద్ధికి వీఎంఆర్‌డీఏ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. క్రీడాకారులు సాధిస్తున్న విజయాల వెనుక వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ సంఘం ప్రతినిధులు భగీరథ తదితరులు పాల్గొన్నారు.

జమ్ము కాశ్మీర్‌పై చండీగర్ విజయం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చండీగర్ ఏడు వికెట్ల తేడాతో జమ్ము-కాశ్మీర్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 285 పరుగులు చేసింది. శుభం ఖజూరియా (72), అబిద్ ముస్తక్ (53 నాటౌట్), సహిల్ లోత్రా (40), నసిర్ ముజాఫర్ (28) రాణించారు. చండీగర్ బౌలర్లలో నిశంక్ బిర్లా మూడు, నిఖిల్ శర్మ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చండీగర్ 42.3 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి 291 పరుగులు చేసి విజయం సొంతం చేసుకుంది. ఓపెనర్లు మనన్ వోహ్రా (107), తుషార్ జోషి (131) సెంచరీలు సాధించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు. జమ్ము కాశ్మీర్ బౌలర్ సునీల్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు.

వసతిగృహానికి మహిళ తరలింపు



పోలీసులతో లక్ష్మి

అక్కయ్యపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన పితాని లక్ష్మి (33)ని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహానికి పోలీసులు తీసుకొచ్చారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆమెను పోలీసులు ప్రశ్నిస్తే ఆధార్ కార్డు కోసం శ్రీకాకుళం నుంచి వచ్చానని పొంతన లేని సమాధానం చెప్పడంతో వారు వసతిగృహానికి తీసుకొచ్చారన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడితే ఎవరూ రాలేమని చెప్పి ఆధార్ కార్డు వివరాలు ఫోన్‌లో పంపించారని తెలిపారు. ఆమెకు భర్త దుర్గా ప్రసాద్, ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమెకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, రెండు రోజుల్లో శ్రీకాకుళం జిల్లా నందగిరిపేటలోని ఇంటికి పంపిస్తామన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో స్వల్ప మార్పు

విశాలాక్షినగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో జరుగుతున్న అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో స్వల్ప మార్పు చేశారు. ఈమేరకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఎం.రవిప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు పీఈటీ పరీక్షలు జరిగే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఈ నెల 8న జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను 11కి వాయిదా వేసినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 944145 0639 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వార్డు సచివాలయాల్లో అందని సేవలు

» సాంకేతిక సమస్యలతో మూలకు చేరిన కంప్యూటర్లు » ఉచిత సలహాలకే ఉద్యోగులు పరిమితం » నెట్ సెంటర్లకు ప్రజలు పరుగు


సచివాలయంలో మూలకు చేరిన ప్రింటర్లు, కంప్యూటర్లు

జగదాంబ కూడలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో పలు సచివాలయాల సేవలు ప్రజలకు అందని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికే సచివాలయాల సేవలను చాలావరకు పక్కన పెట్టేసింది. ప్రస్తుతం తప్పనిసరి చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజానీకం సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కానీ అక్కడ ప్రింటర్లు, కంప్యూటర్లు మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగులు కులం, ఆదాయం, రెవెన్యూ సేవల దరఖాస్తులను అందించలేని పరిస్థితి నెలకొంది. గ్రేటర్ 38వ వార్డు సచివాలయంలో ప్రింటర్లు, కంప్యూటర్లు పనిచేయకపోవడంతో నెట్ సెంటర్‌కు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఉద్యోగులు సలహా ఇస్తున్నారు. దీంతో వారు నెట్ సెంటర్లలో దరఖాస్తు చేశాక, తహసీల్దారు కార్యాలయం పరిశీలించి అర్హత పొందినవాటిని సచివాలయానికి పంపుతారు. అక్కడ నుంచి మళ్లీ నెట్ సెంటరుకు వెళ్లి ప్రింటు తీసుకోవాల్సి వస్తోంది. అత్యవసరమైతే దరఖాస్తుదారుల వాట్సప్‌కు లింకు పంపి నెట్‌లో తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇందు నిమిత్తం రూ.50 సర్వీసు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు అదనపు రుసుములు భరించాల్సి వస్తోంది. నాలుగైదు సార్లు సచివాలయం, నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. 30వ వార్డు సచివాలయంలో సేవల కోసం వచ్చే ప్రజలకు ఉద్యోగులు తగిన సమాచారం ఇవ్వడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దారు సూచనలను సైతం అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగి పట్టించుకోలేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. దరఖాస్తులను సైతం జెరాక్స్ సెంటర్ల నుంచి తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు సూచిస్తున్నారు. సచివాలయాల్లో వాస్తవ స్థితిగతులు, ప్రజలు అక్కడ కోరుకుంటున్న సేవలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా!

» శ్రీకృష్ణాపురం గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్‌పై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి ఆగ్రహం
» చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశం » విద్యార్థులతో మాటామంతీ


ప్రిన్సిపాల్ రత్నవల్లిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి

ఆరిలోవ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శ్రీకృష్ణాపురంలోని డా.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.రత్నవల్లిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ప్రిన్సిపాల్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంట తరువాత అక్కడకు చేరుకొన్న ప్రిన్సిపాల్‌ను ఇదేం విధానమంటూ నిలదీశారు. ఇక్కడి క్వార్టర్స్‌లో కాకుండా ప్రిన్సిపాల్ ఎక్కడో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. సమయపాలన పాటించడం లేదని, పాఠశాల సమస్యలను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా అంటూ నిలదీస్తూ ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం మంత్రి అక్కడే ఉన్న వేదికపై విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. ఇటీవల తోటగరువు హైస్కూలులో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు పొందిన విద్యార్థులను, వివిధ క్రీడా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు. మంత్రి పర్యటనలో విజయనగరం, మన్యం జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయకర్త ఎస్.రూపవతి, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, పాఠశాల వైఎస్ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఉల్లాసం


బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు

సింహాచలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సింహాచలం దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు ఆకాంక్షించారు. ఆదివారం ఆయన బీసీ గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత గోపాలపట్నం సీఐ జి.అప్పారావుతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలకు జోన్-1 పరిధిలోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని 15 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 375 మంది విద్యార్థులు, 15 మంది వ్యాయామ శిక్షకులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రమా మోహిని పాల్గొన్నారు.

నవ్వు...ఆరోగ్యానికి ఎంతో మేలు


సుబ్బారావు పెళ్లి....స్కిట్‌లో హాస్య కళాకారుల అభినయం

డాబాగార్డెన్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మన దినచర్యలోని వీలైనంత ఎక్కువగా నవ్వడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందని ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 'ఫ్రెండ్స్ కామెడీ క్లబ్-విశాఖపట్నం' ఆధ్వర్యంలో 'వినోదాల విందు కామెడీ షో' విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఆడిటర్ తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, వీవీ కృష్ణంరాజు, మాలాద్రి, శివకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి అకౌంటెంట్ పోస్టు...ఎస్‌ఐ కానిస్టేబుల్...సుబ్బారావు..పెళ్లి..సన్మానం..డాక్టర్.పేషెంట్.. అమ్మాయి చుట్టూ..షాపింగ్.. బెల్జియం...అద్దం...మూడు మాత్రలు..లఘు నాటికలు ఆద్యంతం నవ్వులు పూయించాయి. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, కుమారి నాయుడు, పోర్టు శేషు, ఇమంది ఈశ్వరరావు, రమేష్, శివజ్యోతి...సీత..వెంకటేశ్వరరావు, పుష్పమి..సంధ్యా..ప్రియదర్శినిలు ఆయా కామెడీ స్కిట్స్‌ను కళ్లకుకట్టినట్టుగా ప్రదర్శించిన తీరు వీక్షకులను కడుపుబ్బా నవ్వులు పూయించాయి.

తాటిచెట్లపాలెంలో ఎక్కడి చెత్త అక్కడే!


తాటిచెట్లపాలెంలో పేరుకుపోయిన చెత్త

అక్కయ్యపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42, 55 వార్డుల్లోని తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఆ చెత్త కుప్పలు కుళ్లిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు ముక్కుమూసుకుని అటువైపు రాకపోకలు సాగిస్తున్నారు. 55వ వార్డు తాటిచెట్లపాలెం రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద చెత్తడబ్బా కింద వేస్తున్న కుప్పను పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో అలాగే ఉండిపోతుంది. దీంతో ఆ చెత్త ఎగిరిపోయి ఇళ్లల్లోకి వచ్చేస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. 55వ వార్డు పారిశుధ్య పర్యవేక్షణ లోపం కారణంగా ఇలాంటి దుస్థితి ఎదురవుతోందని పలువురు చెబుతున్నారు. రోజూ ఉదయం పారిశుధ్య కార్మికులు చెత్తకుప్పలు తొలగిస్తున్నదీ, లేనిదీ? పర్యవేక్షించాలని, కానీ అలా చేయకపోవడంతో చెత్త పేరుకుపోతోందని అంటున్నారు. అసలు ఈ వార్డులో పారిశుధ్య పర్యవేక్షకుడు పర్యవేక్షించడం లేదని, అందుకోసమే చెత్తకుప్పలు ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. చెత్త ఇలా ఉండడం వల్ల వివిధ రకాల వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధుల సమీక్ష

మహారాణిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు ఆయన పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఆదివారం విశాఖలోని గవర్నర్ బంగ్లాలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రధాని రోడ్డు షో, అనంతరం సభకు తరలి వచ్చే ప్రజానీకం కోసం చేయవలసిన ఏర్పాట్లపై చర్చించారు. సభకు తరలివచ్చే అతిథులు, ప్రజలకు ఇబ్బందిలేకుండా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, వేపాడ చిరంజీవి, ఎం ప్రణవ్ గోపాల్, సీతంరాజు సుధాకర్, గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతో ఆధ్యాత్మిక చైతన్యం

డాబాగార్డెన్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భగవన్నామంతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం మహా విశాఖ నగర శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో సంకీర్తన యజ్ఞం నిర్వహించారు. మధుర గాయని విజయలక్ష్మి కామేశ్వరి ప్రేమావతారులపై మధురంగా సంకీర్తనలు చేశారు. ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్, ఎం.జగన్నాథరావులు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ తమ జీవితాలను ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, కె. మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి జనసమీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

మహారాణిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్‌షో, సభ విజయవంతానికి బూత్‌స్థాయి నుంచి జన సమీకరణ చేపట్టాలని మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాని సభ విజయంతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృత కసరత్తు చేశారు. ఇందులో భాగంగా బూత్‌లెవెల్‌లో కేడర్‌ను సమాయత్తం చేసుకుని పెద్దఎత్తున జనాన్ని ప్రధాని సభకు తరలించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గాని బస్సులు కేటాయించాలని సూచించారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, విప్ గణబాబు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయకుమార్, గౌతు శిరీష, గొండు శంకర్, బెందాళం అశోక్, కార్పొరేషన్ల చైర్మన్లు గండి బాబ్జీ, తాతయ్యబాబు, దొన్నుదొర, పీలా గోవింద్, దామచర్ల సత్య, కిడారి శ్రావణ్‌కుమార్, మల్ల సురేంద్ర, నేతలు బుద్దా నాగజగదీష్, గిడ్డి ఈశ్వరి, లాలం భవాని, బండారు అప్పలనాయుడు, కోట్ని బాలాజి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియంలో మిల్లెట్ చిత్రాలతో ప్రదర్శన


ప్రధాని నరేంద్ర మోదీ చిత్రం

రాంనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ కుమార్ మిల్లెట్స్ వేసిన చిత్రాల ప్రదర్శనను బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఈ ప్రదర్శన ఉంటుంది. ఆదివారం ఈ ఎగ్జిబిషన్‌ను వరుణ్ సంస్థల చైర్మన్ వి.ప్రభుకిషోర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అరుదైన మిల్లెట్ ఆర్ట్‌తో విశాఖ నగరానికి విజయకుమార్ ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారన్నారు. రంగులు ఉపయోగించకుండా సహజత్వంతో తయారు చసిన ఈ చిత్రాలు ఎంతో ప్రత్యేకమన్నారు. సామాజిక స్పృహతో కళకు ఒక సందేశాన్ని జోడించి చిత్రాలను వేయడం అభినందనీయమన్నారు. చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం నుంచి స్ఫూర్తి పొందిన తాను గడిచిన ఏడాదిన్నర కాలంగా మిల్లెట్ చిత్రాలను వేస్తున్నట్టు తెలిపారు. అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జీవితంలోని ముఖ్య ఘట్టాలతో మిల్లెట్ చిత్రాన్ని తయారు చేసినట్టు తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీన నగరానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో మిల్లెట్ ఉపయోగించి మోదీ చిత్రపటాన్ని తయారు చేసినట్టు విజయ కుమార్ వెల్లడించారు. జిల్లా అధికారులు అవకాశం ఇస్తే ప్రధానికి ఈ చిత్రాన్ని బహూకరించనున్నట్టు వెల్లడించారు.

ప్రధాని సభ చిరస్మరణీయంగా నిలవాలి


కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేశ్

... 5వ పేజీ తరువాయి

విజయవాడలో నిర్వహించిన సభను మించి యావత్‌దేశం మనవైపు చూసేలా విశాఖ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభకు కనీసం మూడు లక్షల మంది హాజరయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అధిక నిధులు కేటాయిస్తోందని, అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోందని, మోదీ సభను విజయవంతం చేయడం ద్వారా దానికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. రోడ్‌షో ద్వారా ప్రధాని ప్రజలను పలుకరించనున్నారని, ప్రజలంతా ప్రధాని కాన్వాయ్‌కి చేరువగా ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందిలేకుండా రోడ్‌షో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేతలకు బాధ్యతల అప్పగింత

ప్రధాని మోదీ వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభా వేదిక వరకు రోడ్‌షో నిర్వహిస్తారని, ఆయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. రోడ్‌షో బాధ్యతలను విప్ గణబాబుకు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. మిగిలిన నేతలంతా వారికి సహకరించాలన్నారు. ప్రధాని సభ చారిత్రాత్మకమని, ఈ మూడు రోజులు ప్రజా ప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని నిర్దేశించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంకుబాత్ర బాగ్చీ మంత్రికి వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీవీఐపీ, వీఐపీ వాహనాలు, సభకు తరలివచ్చే ప్రజల వాహనాలకు 26 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ఏయూ ఆదాయానికి గండి

... 5వ పేజీ తరువాయి

కొన్నేళ్లుగా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి వర్సిటీ అధికారులను సంప్రదించాడు. తనకు మైదానాన్ని ఇవ్వాలని కోరారు. ఈ వ్యక్తి వర్సిటీ మాజీ ఉన్నతాధికారికి అత్యంత ఆత్మీయుడు కావడంతో ఈ సెక్షన్‌లోని అధికారులు తలలూపారు. గతంలో దరఖాస్తు చేసిన వ్యక్తికి మైదానం అద్దెకు ఇవ్వడం కుదరదని చెప్పేశారు. మాజీ ఉన్నతాధికారికి ఆత్మీయుడైన వ్యక్తికి తక్కువ అద్దెకే ఇచ్చేశారు. తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైదానంలో ఏడెకరాలు వినియోగంలో ఉన్నట్టు తెలుస్తోంది. నగరం మధ్యలో ఉన్న ఈ స్థలాన్ని అద్దెకు ఇస్తే రోజుకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. కానీ వర్సిటీ అధికారులు తక్కువ అద్దెకు ఇచ్చి స్వామిభక్తిని చాటుకున్నారు. దీంతో ఆదాయానికి భారీగా గండిపడింది.

ఉన్నతాధికారి సూచనతోనే?

సాధారణంగా మైదానం కోసం పోటీ ఉన్నప్పుడు ఎక్కువ అద్దె ఎవరు ప్రతిపాదిస్తే వారికి ఇవ్వాలి. కానీ అధికారులు తమకు కావాల్సిన వారికి తక్కువ అద్దెకు ఇవ్వడంపైనే దృష్టి పెట్టారు. ఈ కేటాయింపు వెనుక మాజీ ఉన్నతాధికారి సూచనలు ఉన్నాయని చెబుతున్నారు.

దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వర్సిటీ ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరుతున్నారు. సాధారణంగా మైదానం అద్దెకు ఇవ్వాలంటే నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వాలని, కానీ అవేవీ పాటించడం లేదని చెబుతున్నారు. విశాఖ లాంటి మహా నగరంలో భిన్నమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు సువిశాలమైన స్థలాన్ని కోరుకునే వ్యాపారులు, ఈవెంట్ ఆర్గనైజర్లు ఎంతోమంది ఉన్నారు. వర్సిటీ అధికారులు మాత్రం ఈ స్థలాన్ని ఎప్పుడూ ఒకే వ్యక్తికి కట్టబెడుతున్నారు. దీని వెనుక అంతర్యమేమిటో ఎవరికీ అంతు చిక్కడం లేదు.

నైట్ ఫుడ్‌కోర్ట్‌పై చర్యలేవీ?

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. దీనివెనుక వైసీపీ ప్రజాప్రతినిధులున్నారని బహిరంగంగానే విమర్శించారు. ఫుడ్‌కోర్టును రద్దుచేయాలని జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో తరచూ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్పందించిన కౌన్సిల్ ఫుడ్‌కోర్టును తొలగించాలని ఏడాది కిందటే తీర్మానం చేసింది. అయినప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. దీంతో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ప్రెస్‌మీట్ పెట్టి నైట్ ఫుడ్‌కోర్టులో జరుగుతున్న అక్రమాలను ఏకరువుపెట్టారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారని, డిసెంబరు 30లోగా ఫుడ్‌కోర్టును తొలగించాలని, లేదంటే ధర్నా చేస్తామని జీవీఎంసీ కమిషనర్‌కు అల్టిమేటం జారీచేశారు. తర్వాత ఏమైందో కూటమి కార్పొరేటర్లంతా మౌనం వహించారు. కాగా వారికి ఏదో ఆఫర్ వచ్చి ఉంటుందని, అందుకే నోరెత్తడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ ఓవరాల్ చాంప్ విశాఖ


అతిథుల నుంచి ఓవరాల్ చాంప్ ట్రోఫీ అందుకుంటున్న విశాఖ అథ్లెట్లు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఆదివారం తణుకులో జరిగిన ఈ టోర్నీలో విశాఖ అథ్లెట్లు మూడు స్వర్ణ, ఒక రజత, ఐదు కాంస్య పతకాలు సాధించి పురుషులు, మహిళల విభాగాల్లో సంయుక్తంగా ఓవరాల్ చాంప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. ఈ టోర్నీ అండర్-16 బాలికల 2 కి.మీ. రేస్‌లో బి.ప్రవల్లిక స్వర్ణ పతకం, అండర్-18 బాలికల 4 కి.మీ. రేస్‌లో కె.రాగిణి కాంస్య పతకం, అండర్-20 మహిళల 6 కి.మీ. రేస్‌లో వి.హాసిని కాంస్య పతకం, మహిళల 10 కి.మీ రేస్‌లో ఎల్.మేరీగ్రేస్ స్వర్ణం, కె.దివ్యదుర్గ రజతం, వి.జ్యోతిదుర్గ కాంస్య పతకాలు సాధించారు. అండర్-20 పురుషుల 8 కి.మీ రేస్‌లో ఎం.చిన్న కాంస్యం, 10 కి.మీ రేస్‌లో ఎంఎస్‌జె. వేదవ్యాస్ స్వర్ణ పతకం, వి.రమేష్ కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని సాధించిన అథ్లెట్లను జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంవీ .కార్తీక్ అభినందించారు.

నేటి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

» ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ



వడ్లపూడిలో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు పిలుపునిచ్చారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితిలో ఆదివారం నిర్వహించిన పాదయాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల ఎనిమిదిన విశాఖ వస్తున్న ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, లేదా ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి నడుపుతామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగులకు తక్షణమే నాలుగు నెలల జీతం బకాయిలను చెల్లించాలని, మూడేళ్ల ట్యాక్స్ హాలిడే ఇవ్వాలని, ప్లాంటుకు సొంత గనులను కేటాయించాలని, నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ప్రభుత్వాలు న్యాయం చేయాలని, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే నడపాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, ప్రగడ వేణుబాబు, ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ శ్రీను, శంకరరావు, దానప్పలు, రవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ప్రచారం

అగనంపూడి: చలో కలెక్టరేట్ పేరిట సోమవారం ఉక్కు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానికంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు. నాయకులు కేఎస్ఎన్ రావు, రమణమూర్తి, కరణం పైడిరాజు, పి.నీలకంఠం, ఎస్.గోవింద్, బి.సత్యనారాయణ, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి: మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంటును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేపట్టారు. పెదగంట్యాడ కూడలిలో పాదయాత్రను ప్రారంభించిన అనంతరం మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల ఎనిమిదిన విశాఖ విచ్చేస్తున్న ప్రధాని మోదీ దృష్టికి ఉక్కు కర్మాగారం సమస్యను ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లాలన్నారు. ఏఐటీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు సొంత గనులు కేంద్రం కేటాయించాలన్నారు. ఇంటక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గొందేశి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు కేటాయించి, మూడేళ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. పెదగంట్యాడ కూడలి నుంచి ప్రారంభమైన పాదయాత్ర దుర్గవానిపాలెం, చినకోరాడ, నెల్లిముక్కు, బాలచెరువు, సీతానగరం నుంచి నడుపూరు గాంధీ పార్కు వరకు సాగింది. కార్యక్రమంలో నాయకులు ఎ.మసేన్‌రావు, యు.రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, బొడ్డు పైడిరాజు, జెర్రిపోతుల ముత్యాలు, యెల్లేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర చేస్తున్న నాయకులు, కార్మికులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

ఉద్యమాలతో ఆవిర్భవించిన స్టీల్‌ప్లాంటును ఉద్యమాలతోనే కాపాడుకోవాలని ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ నడుపూరు రాజీవ్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తేదీన నగరానికి వస్తున్న మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు యరబాల భూలోక, కొత్తపల్లి పెంటయ్య, ఎంఎస్ వర్మ, కట్టా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి దారుణం

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుందని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ అన్నారు. ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వైటీ దాసు, డొక్కా నరసింగరావు, వి.ప్రసాద్, రాథోడ్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణ, రోడ్ షో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించడానికి నగరానికి విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం 8.50 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబుతో పాటు పలువురు కూటమి నాయకులు స్వాగతం పలికారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నారా లోకేశ్

రైతు బజారులో స్వచ్ఛ భారత్

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు మర్రిపాలెం రైతుబజారులో ఆదివారం రైతులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. బజారులో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు రెండు నెలలకొకసారి స్వచ్ఛ భారత్ నిర్వహిస్తుంటారు. ఈవో నారాయణరావు, సహాయకుడు ప్రతాప్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 42, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

వెలమల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలి

ఏపీ కొప్పుల వెలమ కార్పొరేషన్ అసోసియేషన్ చైర్మన్ పీవీజీ కుమార్

వేపగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వెలమల అభ్యున్నతికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఏపీ కొప్పుల వెలమ కార్పొరేషన్ అసోసియేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ కోరారు. 98వ వార్డు పరిధి పద్మావతినగర్ సమీపంలోని వాసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన రంగరాయ వెలమ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ కాలనీ, గ్రామాల్లో వెలమ సభ్యులు ఎంతమంది ఉన్నారు, వారిలో ఎంతమంది వెనకబడి ఉన్నారో జాబితా తయారు చేసేందుకు యువకులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చుక్కా చినబాబు, వనం నాయుడు, నరవ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుజాత నగర్ రంగరాయ వెలమ సంక్షేమ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా లగుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా టి.మహేశ్, ఉపాధ్యక్షుడిగా ఆనందరామ్, సహాయ కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.వెంకటరమణ, సభ్యులుగా ఆర్.సత్యం, మంగరాజు, భావం ప్రకాశ్, బి.నరేశ్‌కుమార్, ఆదిత్యానాయుడు ఎన్నికయ్యారు.

క్రేన్ల వ్యాపారాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలి

వీహెచ్‌సీఓఏ చైర్మన్ రాజేశ్, అధ్యక్షుడు లీలా రాఘవరావు



సమావేశంలో పాల్గొన్న రాజేశ్, లీలారాఘవరావు తదితరులు

ఆటోనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రేన్ల వ్యాపారాన్ని పారిశ్రామిక రంగంగా కూటమి ప్రభుత్వం గుర్తించాలని విశాఖపట్నం హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ (వీహెచ్‌సీఓఏ) చైర్మన్ రాజేశ్, అధ్యక్షుడు లీలా రాఘవరావులు కోరారు. ఆటోనగర్‌లో ఆదివారం జరిగిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో వారు మాట్లాడుతూ డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి ఏకరీతి పన్నును విధించినట్టయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో ఉన్న భారీ క్రేన్‌ల యజమానులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఇందుకోసం ప్రభుత్వాలు సహకరించాలన్నారు. తెలుగు రాష్ట్రాల నమోదిత భారీ క్రేన్‌లపై జీవిత పన్నును మినహాయించాలని, రుణాలపై బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకుమహంతి చంద్రశేఖర్, సభ్యులు సుబ్రహ్మణ్యం, నాని, కోటేశ్వరరావు, శంకర్ నారాయణ్, కృష్ణంరాజు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

గోపాలపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో పీఆర్‌టీయూ ఉత్తరాంధ్ర కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను మళ్లీ గెలిపిస్తే కామన్ సర్వీస్ రూల్స్ తప్పనిసరిగా అమలు చేసి ప్రతి ఉపాధ్యాయుడు తన పదవీ కాలంలో పదోన్నతులు పొందేలా చూస్తానన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి అందరికీ ఓపీఎస్ విధానాన్ని తీసుకువస్తానని, హెల్త్ కార్డులు అందరికీ ఉపయోగపడేలా చూస్తానన్నారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, కేజీబీయూ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మల్కాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంసీహెచ్ స్కూల్ 1986-1987 పూర్వ విద్యార్థులు వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం మాధవధారలోని మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ.. ఒకరొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. పలు సినిమాల్లోని పాటలకు సరదాగా డ్యాన్స్‌లు చేశారు. అనంతరం కేక్ చేశారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చలికి అల్లాడుతున్న అనాథలకు స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కణితి, వడ్లపూడి, కూర్మన్నపాలెం, దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు, కణితి ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్నవారికి దుప్పట్లు అందజేశారు.

రాష్ట్ర స్థాయి నడక పోటీల్లో నరసింగరావుకు రజతం

అగనంపూడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ నడక పోటీల్లో ఇక్కడి దిబ్బపాలేనికి చెందిన చట్టి నరసింగరావు రజత పతకం సాధించారు. దీంతో ఆయన కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ ముఖ్యఅతిథిగా హాజరై నరసింగరావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగిగా పనిచేస్తూ క్రీడల్లో పాల్గొంటూ నరసింగరావు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉరిటి మరిడయ్య, మొల్లి కోటేశ్వరరావు, వి.రాము, పి.రమేశ్, వీర అప్పారావు, నరసింగరావు, దుర్గారావు, కృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మోగిన శంఖం




కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దంపతులు, తదితరులు.. పక్కన పుష్పాల నడుమ ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి

వెంకటాద్రిపై వైభవంగా సుదర్శన హోమం

పెందుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమాన్ని వైభవంగా జరిపారు. ముందుగా శ్రీవారికి తిరుప్పావై పారాయణలో 21వ పాశురాన్ని వినిపించారు. గోపూజలు చేశాక ఆలయ ప్రాంగణంలోని సుదర్శన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై శ్రీనివాస, పద్మావతి, మంగాదేవిల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి హోమగుండాలు ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకులు మహర్తి రామానాజుచార్యుల ఆధ్వర్యంలో రుత్వికుల బృందం వేద మంత్రాలు పఠిస్తూ శాస్త్రోక్తంగా 72 మంది దంపతులతో సుదర్శన హోమం జరిపారు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మహాలక్ష్మి దంపతులు సుదర్శన హోమంలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ సుదర్శన హోమానికి పూర్ణాహుతి సమర్పించారు.

సామూహిక కుంకుమ పూజలు

ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు గోవింద, గోదాదేవి నామాలను జపిస్తూ సామూహిక కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక వేదికపై కొలువైన ఉత్సవమూర్తులకు వివిధ రకాల పుష్పాలతో శ్రీపుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎంఎస్ రాజు, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, ముదునూరి రాజా సుధాకర్, సింహాచలం నాయుడు, కరణం కనకారావు, జెడ్పీటీసీ ఉప్పిలి దేవీ కనకరాజు, తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు.

కల్యాణ వెంకన్నకు పూజలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో వైభవంగా ధనుర్మాస వేడుకలను నిర్వహిస్తునానరు. ఇందులో భాగంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, అర్చనలు చేశాక 21వ పాశురాన్ని స్వామివారికి అర్చకులు వినిపించారు. కాగా ఆలయంలో కొన్నేళ్లుగా సహాయక అర్చకునిగా వ్యవహరించిన పార్థసారధి దంపతులను, పలువురు స్వచ్ఛంద సేవకులకు, సహాయక సిబ్బందికి ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణమూర్తి, సుభాషిణి, ఎర్రమ్మ, హరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో సహస్ర దీపాలంకరణ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణను వైభవంగా చేపట్టారు. ముందుగా శ్రీవారిని బంగారు, వెండి ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, పద్మ, రాజ్యలక్ష్మి, చిన్న సురేశ్, రమేశ్, శాంతి, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయంలో సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

అపస్మారక స్థితిలో వ్యక్తి మృతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధి కూర్మన్నపాలెం ఆర్చి సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ ప్రాంతానికి చెందిన కర్రి కొండలరావు (67) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కొండలరావు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఆదివారం ఉదయం ఆర్చి సమీపం వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్టు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమచారం అందింది. దీంతో సీఐ కేశవరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రోడ్డుపై పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకుని కొండలరావు మృతి చెందినట్టు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైందవ శంఖారావ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

గాజువాక, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి): కృష్ణా జిల్లా కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివా రం జరిగిన హైందవ శంఖారావ సభకు బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నేతృత్వంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. దేశంలోనే తొలిసారిగా హిందూ భారీ బహిరంగ సభ, జరిగిందని, హిందూ ఆలయాల పరిరక్షణకు చేపట్టిన ఈ సభ విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు.



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే
ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం..
అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్లు అనుభవించారు
చెన్నైకి చెందిన భాను సురేష్‌బాబు. కష్టనష్టాలు
భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను
మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా
అనుభవించకూడదనే ఆలోచనతో...
డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి...
వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.
స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం
గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై, మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం

మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటువైపు వెళ్లరు.


ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె



- ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం



- దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు



- కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

ముగ్గులతో సంక్రాంతి శోభ

మహిళలను ప్రోత్సహించడంలో 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముందంజ



సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో రంగవల్లికలను తీర్చిదిద్దుతున్న మహిళలు



తృతీయ స్థానం సాధించిన ప్రవీణ, ద్వితీయ స్థానం సాధించిన లక్ష్మీమూర్తికి నగదు బహుమతులు అందిస్తున్న ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌వీ రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, ప్రకటనల విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ మేనేజర్ సత్యనారాయణ ఉన్నారు.

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే ఉద్దేశంతోనే ప్రతి ఏటా పోటీల నిర్వహణ
- ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె. రామకృష్ణారావు

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) :

పండగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలతో నగరానికి ముందుగానే సంక్రాంతి వచ్చిందని 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె. రామకృష్ణారావు అన్నారు. సీతమ్మధారలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ఆవరణలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకునే ఉద్దేశం తోనే గత కొన్నాళ్లుగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజ మాన్యం పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళ ముగ్గులను అద్భుతంగా తీర్చిదిద్దారని, న్యాయనిర్ణేతలు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారని వివరించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా విజేతల ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యం క్రమం తప్పకుండా అత్యంత పకడ్బందీగా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో మహిళలు ముగ్గులు వేయడాన్ని మర్చిపోతున్నారని, ఈనేపథ్యంలో మంచి ముగ్గులు వేసేలా ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సంక్రాంతి అంటే తప్పనిసరిగా 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ గుర్తుకు వస్తుందని చెప్పారు. నిత్యం పనుల వల్ల ఒత్తిడికి గురయ్యే మహిళలు కాస్త ఉపశమనం పొందేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. ముగ్గు వేయడం అంటే స్వాగతం పలుకడమని, రంగుల కలయికే రంగోళి అని పేర్కొన్నారు. విజేతల ఎంపికలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మరో న్యాయ నిర్ణేత ఏఎస్ రాజా కళాశాల డైరెక్టర్ లారెన్స్, ఆంధ్రజ్యోతి విశాఖపట్నం ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌వీ రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, అడ్వైర్టైజ్‌మెంట్ విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ మేనేజర్ సత్యనారాయణ, ఏబీఎన్ ఇన్‌చార్జి నాయుడు, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్లు నాళ్ల ఆదినారాయణ, రెడ్డి వెంకటరావు, బూటు శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కాగా పోటీలకు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఏబీఎన్ ఇన్‌చార్జి నాయుడు మహిళలను ఉత్సాహపరిచారు. చిన్నారులు, మహిళలతో కలిసి నృత్యాలు చేసి అలరించారు. పోటీలకు వేదికను అందించిన శ్రీప్రకాష్ యాజమాన్యానికి ఈ సందర్భంగా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత వి. లక్ష్మీమూర్తి

ఆనందాన్ని మాటల్లో చెప్పలేను

-ఎ. సంతోషి, ప్రథమ బహుమతి విజేత



ఏడేళ్లుగా ముగ్గుల పోటీలకు వస్తున్నాను. గతంలో ఒకసారి జిల్లాస్థాయి విజేతగా నిలిచాను. ఇప్పుడు మరోసారి విజేతగా నిలవడం ఆనందంగా ఉంది. 21 చుక్కలతో సంక్రాంతి థీమ్‌తో రథం ముగ్గు వేశాను. పోటీల కోసం నెల రోజుల ముందు నుంచే సిద్ధమవుతుంటాను. గతంలో రెండో స్థానంలో నిలిచాను. నాలుగు, ఐదో స్థానంలో ఒకసారి నిలిచాను. రెండోసారి ప్రథమ బహుమతి పొందడం సంతోషంగా ఉంది. మహిళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఏటా క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి' 'ఏబీఎన్' యాజమాన్యానికి కృతజ్ఞతలు.

మంచి వాతావరణంలో పోటీలు

- వి.లక్ష్మీమూర్తి, ద్వితీయ బహుమతి విజేత



పోటీలు అంటే ముగ్గులు వేయడం, వెళ్లిపోవడం అనుకున్నాను. కుటుంబ సభ్యుల మధ్య జరిగినట్టు అనిపించింది. రెండోసారి పోటీలో పాల్గొన్నాను. రెండో స్థానం సాధించడం ఆనందంగా ఉంది. ఎక్కువ మంది మహిళలు రావడంతో గట్టి పోటీ జరిగింది. ఏడు నుంచి తొమ్మిది చుక్కలతో రథం ముగ్గు వేశాను. సంక్రాంతి థీమ్ ప్రతి బింబించేలా తీర్చిదిద్దాను. కలర్ కాంబినేషన్, థీమ్‌కు అనుగుణమైన వస్తువుల డెకరేషన్‌తో విజేతగా నిలిచాను అనిపిస్తోంది. వచ్చే ఏడాది ప్రథమ బహుమతి లక్ష్యంగా సిద్ధమవుతాను.

పోటీ తీవ్రంగా ఉండడంతో మూడో స్థానం

- ఆర్.ప్రవీణ, తృతీయ బహుమతి విజేత



పదేళ్లుగా పోటీలకు హాజరవుతున్నాను. ప్రతిసారి టాప్‌లో ఉంటున్నా. ఈఏడాది తొలిస్థానమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేశాను. పోటీ తీవ్రంగా ఉండడంతో మొదటి, రెండు స్థానాలు తప్పిపోయాయి. వచ్చే ఏడాది మొదటి స్థానంలో నిలుస్తాననే నమ్మకం ఉంది. ఇప్పటివరకు ఐదు సార్లు ఏదో ఒక స్థానాన్ని సాధిస్తూ వచ్చాను. నాలుగుసార్లు తొలి స్థానం వచ్చింది. ఇప్పుడు మూడో స్థానం వచ్చింది. ఏడు నుంచి 21 చుక్కలతో సంక్రాంతి థీమ్‌తో ముగ్గు వేశాను. ఏటా కొత్త వారు వస్తుండడంతో పోటీ పెరుగుతోంది. భిన్నమైన ఆలోచనలతో పోటీలకు రావాలన్న ఆలోచన పెరుగుతోంది. మహిళలనుప్రోత్సహించే ముగ్గుల పోటీలు నిర్వ హించడం గొప్ప విషయం.



తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత ఆర్.ప్రవీణ



పోటీలో అందమైన ముగ్గు వేస్తున్న మహిళ



ముగ్గును పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు ఏఎస్ రాజా కళాశాల డైరెక్టర్ లారెన్స్, ఎన్ఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి



ముగ్గులతో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు